## కలెక్టర్‌కు శుభాకాంక్షలు

సంగారెడ్డి, జనవరి 12: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వల్లూరు క్రాంతిని వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా ఆధ్యుడు మధుశేఖర్ ఆధ్వర్యంలో కలిసి బసవేశ్వరుడి విగ్రహాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. విగ్రహంతోపాటు బసవేశ్వరుడి చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సమాజం సభ్యులు కంది సర్పంచ్ విమలావీరేశం, కొంక రాజేశ్వర్, పట్లోళ్ల శివరాజ్‌పటేల్, రామోజీ, నవీన్, అశోక్, అరుణ, కరుణ, శశికళ, వసంత, రాణమ్మ, జగదీశ్వర్, శోభమ్మ, సంతోష, గీత, అనిత, రాజు తదితరులు ఉన్నారు.



కలెక్టర్ క్రాంతికి బసవేశ్వరుడి విగ్రహాన్ని అందజేస్తున్న వీరశైవ లింగాయత్ సభ్యులు

## యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దు

గుమ్మడిదల, జనవరి 12: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గుమ్మడిదలలో ఆయన మాట్లాడుతూ కొన్ని ఏండ్ల నుంచి వ్యవసాయ యూనివర్సిటీలో వేలాదిమంది విద్యార్థులు చదువుకుంటూ కొత్త కొత్త వంగడాలపై రీసర్చ్ చేస్తున్నారన్నారు. విద్యార్థుల కోసం ఏర్పడిన వ్యవసాయ యూనివర్సిటీని హైకోర్టుకు కేటాయించాలని ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. రాష్ట్ర రైతాంగానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని విజ్ఞప్తి చేశారు.

## చెరుకు రైతులకు మంచి అవకాశం

### వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ





కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్, జనవరి 12: రాయికోడ్ మండలంలో ప్రైవేట్ చక్కెర పరిశ్రమ ఏర్పాటు చేయడం సంతోషకరమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మండలంలోని మాటూర్ గ్రామ శివారులో గోదావరిగంగా చక్కెర పరిశ్రమ ఏర్పాటుకు భూమి ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో చక్కెర కర్మాగారం ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సరైన పరిశ్రమ లేక ఈ ప్రాంతంలో రైతులు చెరుకు వేయడమే మానేశారన్నారు. ఈ పరిశ్రమకు ప్రభుత్వం తరపున అన్ని సహాయసహకారాలు ఉంటాయన్నారు. సమావేశంలో పంచావటీ పీఠాధిపతి సద్గురు కాశీనాథ్ బాబా, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రాష్ట్ర షుగర్ కేన్ కమిషనర్ మాళోత్ర, మాజీ ఎంపీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ మమత, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, మాజీ జడ్పీటీసీ అంజయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏసయ్య, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ పండరి, నాయకులు మాక్సుద్, సతీశ్‌పంతులు ఉన్నారు.

## ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటాం

### మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 12: నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తనూ కంటికిరెప్పలా కాపాడుకుంటామని మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు తుకారాం శుక్రవారం కల్హేర్ మండలం ఖానాపూర్‌లోని మాజీఎమ్మెల్యే నివాసంలో భూపాల్‌రెడ్డిని కలిసి తన ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశాడు. కొన్ని రోజులుగా కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం జరుగుతుండడంతో మాజీ ఎమ్మెల్యేను కలిసినట్లు తుకారం తెలిపారు. తుకారాం గత మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండు ఓట్లతో ఓటమి చెందినప్పటికీ పార్టీ అభ్యున్నతి కోసం క్రియాశీలకంగా పనిచేశాడు. అనంతరం నారాయణఖేడ్‌కు చెందిన పురోహితుడు మోహన్‌జ్యోషి శుక్రవారం మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి అయోధ్యలోని స్వామి వారి ప్రాణప్రతిష్ఠ అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూపాల్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



తుకారామ్‌కు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## మహిళా సంఘాలకు రుణ మంజూరు పత్రాలు అందజేత

గుమ్మడిదల, జనవరి12: స్వయం సహాయక మహిళా సంఘాలకు మంజూరైన రుణ పత్రాలను డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు అందజేశారు. శుక్రవారం గుమ్మడిదల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మేనేజర్ శ్రీదేవి, ఎఫ్‌వో బాలచంద్రం ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ మహాలాగిన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ కానుకుంట గ్రామానికి చెందిన రత్నప్రభ స్వయం సహాయక మహిళా సంఘానికి మంజూరైన రూ.19 లక్షల రుణపత్రాలను డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, బ్యాంకు మేనేజర్ అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఆదాయ కార్యక్రమాలకు పెట్టుబడి పెట్టాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు పీఎంఎస్‌బీవై, పీఎంజేబీవై ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుమ్మడిదల ఎస్‌బీఐలో 414 స్వయం సహాయక మహిళాసంఘాలకు ఇప్పటివరకు రూ.2605.51 లక్షలకు గానూ 2989.87 లక్షలు రుణాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం శికుమార్, సీసీలు బుచ్చమ్మ, స్వప్న, మహేశ్వరి ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ) జహీరాబాద్ శాఖ

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.**

దిగువ రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జహీరాబాద్ శాఖ**కు బకాయి 31-03-2021 నాటికి **రూ. 13,08,781/- (పదమూడు లక్షల ఎనిమిది వేల ఏడు వందల ఎనభై ఒక్క రూపాయలు మాత్రమే)** + వడ్డీ+ ఇతర చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జహీరాబాద్ శాఖ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి ''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'' మరియు ''అక్కడ ఏమున్నదో అదే'' ప్రాతిపదికన ఇ-వేలం తేది: **14-02-2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర: **రూ. 24,93,000/-** మరియు బయానా డిపాజిట్: **రూ. 2,49,300/-**

**రుణగ్రహీత/ తనఖాదారు: 1. శ్రీ గొర్రె నవాజ్ రెడ్డి, తండ్రి ఇంద్రారెడ్డి,** ప్లాట్ నం. 51, వెంకటరమణ నగర్ కాలనీ, అలీపూర్, జహీరాబాద్. **హామీదారు/ తనఖాదారు: శ్రీ గొర్రె దత్త రెడ్డి, తండ్రి శ్రీ గొర్రె నవాజ్ రెడ్డి,** ప్లాట్ నం. 51, వెంకటరమణ నగర్ కాలనీ, అలీపూర్, జహీరాబాద్.

**తనఖాపెట్టిన ఆస్తి వివరణ: 1. శ్రీ గొర్రె నవాజ్ రెడ్డి & గొర్రె దత్త రెడ్డి** పేరునగల సంగారెడ్డి జిల్లా, అలీపూర్ గ్రామం & గ్రామ పంచాయతీ (గతంలో), ఇపుడు జహీరాబాద్ మండలం & మున్సిపాలిటీ, వెంకటరమణ నగర కాలనీ వద్దగల L.P.No. 17/17, సర్వే నం. 64/A/3లో ప్లాట్ నం.51, H.No. 19-18, 543.75 చ.అడుగుల గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియాతో నివాస భవనం మరియు 146.66 చ.గజాల విస్తీర్ణపు భూమి ఆస్తి సెక్యూరిటీ. **సేల్ డీడ్ & వాల్యుయేషన్ రిపోర్ట్ ప్రకారం సరిహద్దులు: సైట్ ప్రకారం:** ఉత్తరం: ప్లాట్ నం. 50 పై ఇల్లు, దక్షిణం: ప్లాట్ నం. 52పై ఇల్లు, తూర్పు: ప్లాట్ నం. 53 & ఖాళీ స్థలం, పడమర: 20'-00'' వెడల్పు రోడ్. **డాక్యుమెంట్ ప్రకారం:** ఉత్తరం: ప్లాట్ నం. 50, దక్షిణం: ప్లాట్ నం. 52, తూర్పు: ప్లాట్ నం. 53 & ఖాళీ స్థలం, పడమర: 20'-00'' వెడల్పు రోడ్.

**సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిపిన తాకట్టు రుణభారాలు: తెలియవు**

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా **www.unionbankofindia.co.in, http://www.ibapi.in &** సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ అనగా **www.mstcecommerce.com**లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.

తేది: 12-01-2024 **అధీకృత అధికారి**
ప్రదేశం: జహీరాబాద్

**స్టాట్యుటరీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 30/15 రోజుల అమ్మకం ప్రకటన**

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



యాగశాలలో ఏర్పాటు చేసిన హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్న దంపతులు

## వైభవంగా సిద్ధి వినాయకుడి జయంతోత్సవాలు

న్యాల్‌కల్, జనవరి12: రేజింతల్ సిద్ధి వినాయకస్వామి 224వ జయంతోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారి జయంతోత్సవాలను పురస్కరించుకుని రంగురంగుల పువ్వులు, కొబ్బరి, మామిడితోరణాలతో ఆలయ పరిసరాలతోపాటు గర్భగుడిని అందంగా అలంకరించారు. కంచికామ పీఠం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయంలో ఉదయం 6గంటల నుంచి వేదఘోష, దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవచానం, మాతృకా పూజ, ఆచార్య రుత్వికవర్ణం, స్వామివారికి అభిషేకం, దేవతాఆహ్వానం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ కమిటీ సభ్యులతో యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం యాగశాలలో యజ్ఞాలను వైభవంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సందడితోపాటు వేదపండితుల మంత్రోచ్చారణలో ఆలయం మారుమోగింది. ఈ హోమాల్లో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన 250మందికిపైగా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, హద్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ కమిటీ, పలువురు దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధానకార్యదర్శి అల్లాడి నర్సింహులు, ఉపాధ్యక్షులు నీలారాజేశ్వర్, బస్వరాజ్, సెక్రటరీ కల్వ చంద్రశేఖర్, చిద్రి లక్ష్మణ్, కమిటీ సభ్యులు కొబ్బాజీ రవికుమార్, సుధాకర్‌పాటిల్, బస్వరాజ్ సిందోల్, రాజ్‌కుమార్ అగర్వాల్, చంద్రశేఖర్, అశోక్, మేనేజర్ కృష్ణ, వేదపండితులు పాల్గొన్నారు.



## దరఖాస్తులు స్వీకరణ

హత్నూర, జనవరి 12: హత్నూర మండలం గుండ్లమాచునూర్ శివారులోని ఆదర్శ పాఠశాలలో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 12 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఆన్‌లైన్‌లో నమోదు

న్యాల్‌కల్, జనవరి 11: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నట్లు మండల అధికారులు పేర్కొన్నారు. గురువారం న్యాల్‌కల్ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న దరఖాస్తుల డేటా ఎంట్రీని మండల తహసీల్దార్ భానుకిరణ్, మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 37గ్రామ పంచాయతీల్లో అర్హులైన వారి నుంచి ఆరు గ్యారెంటీలకు సంబంధించి 15,007 దరఖాస్తులు స్వీకరించామన్నారు. రేషన్ కార్డులతోపాటు ఇతరాత్ర వాటికి సంబంధించి 3,639 దరఖాస్తులు వచ్చాయన్నారు. 10,032 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ఈ నెల 17వ తేదీలోగా డేటా ఎంట్రీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్
- అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం




ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 12: ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈనెల 6న ఓటర్ డ్రాఫ్ట్ జాబితా ప్రచురితమైందని, క్లైమ్స్ అభ్యంతరాలకు ఈనెల 22 వరకు అవకాశమున్నదని తెలిపారు. మార్పులు, చేర్పులకు ఫారం 8లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకోవాలని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలు పంపించామన్నారు. 2కిలోమీటర్ల పరిధి దాటిన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిని మార్చాలని ఆయా పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 20, 21తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాతో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో డీఆర్వో నగేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటే ఆయుధం**

ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ప్రతిఒక్కరూ ఓటుగా నమోదు కావాలని కలెక్టర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఓటరు నమోదు, స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కొత్తగా అర్హత గల వారిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు విధిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం అందరిచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు మనహక్కు అనే స్టిక్కర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీఆర్వో నగేశ్, ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

**పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం**

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సీఎస్ఆర్ నిధుల జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు కంపెనీ యాక్ట్ మేరకు సామాజిక బాధ్యతగా జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను అందించి సహకరించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో స్థానికంగా ఉన్న ప్రాంతానికి, జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా కంపెనీలకు ఐదేండ్లలో వచ్చిన ప్రాఫిట్ సీఎస్ఆర్ కింద జిల్లాలో వెచ్చించిన నిధులకు సంబంధించి వివరాలు అందించాలని తెలిపారు. పరిశ్రమలు తమ ప్రాఫిట్‌లో రెండుశాతం సీఎస్ఆర్ కింద నిధులు ఇవ్వాల్సి ఉంటుందని, కంపెనీ వారీగా ఇప్పటి వరకు ఎంత ఇచ్చారు.. ఇంకా ఎంత ఇవ్వాల్సి ఉన్నదని, ప్రతి సంవత్సరం వారి వివరాల నివేదికను సీఎస్ఆర్ నోడల్ అధికారులు అందించాలని కలెక్టర్ సూచించారు.

**గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి**

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. శనివారం గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర వేడుకలను పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు, స్వాతంత్య్ర సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ సిద్ధం చేయాలని ఆర్డీవోను ఆదేశించారు.


పోలీసు పరేడ్ మైదానం పారిశుధ్య నిర్వహణ, వేడుకలకు వచ్చే ప్రజలకు, విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అందరి సమన్వయంతో గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

## అధికార పార్టీ నాయకులే కరెంటుపై విమర్శలు

వట్‌పల్లి, జనవరి 12 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజులు కూడా కాకముందే రైతులకు కరెంటు కష్టాలను తెలియజేసింది. మండల పరిధిలోని మెడుకుంద్యా గ్రామంలోని సబ్‌స్టేషన్ ఎదుట గురువారం కాంగ్రెస్ నాయకులు, రైతులు ధర్నా చేశారు. వారం రోజులుగా విద్యుత్ అధికారులు వ్యవసాయానికి సరైన కరెంట్ ఇవ్వడం లేదని కాంగ్రెస్ మండల నాయకులు మండిపడ్డారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఎండిన పంటలకు నష్టపరిహారం అధికారులే చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజుకు 10 నుంచి 15 సార్లు విద్యుత్ పోవడం, రావడంతో మోటర్లు పాడవడమే కాకుండా పంటలు ఎండిపోతున్నాయన్నారు. నాలుగు రోజులుగా సబ్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ధర్నాకు దిగిన రైతులకు అధికారులు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. అన్నంపెట్టే రైతులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వీరన్న, విష్ణు కాష్, నాగయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా : మంత్రి దామోదర

మునిపల్లి, జనవరి 12: తాటిపల్లి శివారులోని కస్తుర్బాగాంధీ బాలికల హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని పాఠశాల ప్రిన్సిపాల్ కవిత వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదార రాజనర్సింహ దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం తాటిపల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రిని కస్తుర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలికల హాస్టల్లో సమస్య లు పరిష్కరించేందుకు సుమారు రూ. 30 లక్షలు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అంతేకాకుండా మునిపల్లిలో ఆదర్శ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సతీశ్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.



తాటిపల్లిలో మంత్రికి సమస్యలు వివరిస్తున్న కస్తుర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత

## ఘనంగా యువజనోత్సవాలు

సంగారెడ్డి కలెక్టరేట్/ చౌటకూరు/ జిన్నారం/ సదాశివపేట/నారాయణఖేడ్/హత్నూరా/ అందోల్ జనవరి 12 : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం సిద్దిపేట, సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ సహకారంతో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ రాములు మాట్లాడుతూ యువత సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. సాధారణంగా ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోయేది 30 సంవత్సరాలలోపు ఉన్న యువత అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు రాంహరి సుబేదార్ మేజర్, శంకర్ సుబేదార్, మంగల్ సింగ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏవీ శర్మ, తొలిమెట్టు రాష్ట్ర అధికారి రొమిల్లా, ఎన్‌సీసీ అధికారి మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్లు అభిజిత్, సిద్ధులు, పద్మజ, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కదంబపత్రంపై వివేకానందుడి చిత్రం

నారాయణఖేడ్, జనవరి 12: లీఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన నారాయణఖేడ్‌కు చెందిన చిత్రకారుడు గుండు శివకుమార్ ఆకుపై మరో అద్భుతమైన చిత్రాన్ని వేసి అందరి దృష్టిని ఆకర్షించారు. సందర్భానుసారంగా ఆకుపై చిత్రాలు వేసే శివకుమార్ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కదంబపత్రంపై వేసిన వివేకానందుడి నిలువెత్తు చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. అదేవిధంగా రావి ఆకుపై వివేకానందుడి మరోచిత్రాన్ని సైతం వేశారు. ఇప్పటివరకు వేసిన చిత్రాలకంటే కదంబపత్రంపై వేసిన వివేకానందుడి చిత్రం ఆకర్షణీయంగా కనిపిస్తుండడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.





## ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాస సదస్సు


సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 12: ఉపాధ్యాయుల వ్యక్తిగత అభివృద్ధి కోసం శుక్రవారం విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన యాంకర్ మహేశ్ వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా ఉపాధ్యాయుల్లో సృజనాత్మక సామర్థ్యాలను, సరికొత్త నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల కరెస్పాండెంట్ ఆంథోనీరెడ్డి, సెయింట్ పీటర్స్ కరెస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మార్రెడ్డి, మహేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

పుల్కల్, జనవరి 12: తెలంగాణ మోడల్ స్కూల్ బస్వాపూర్‌లో 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 100 సీట్లు,7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను బట్టి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీలకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

బొల్లారం, జనవరి 12: బొల్లారం మున్సిపాలిటీలోని బీసీకాలనీ సర్వేనంబర్ 75లో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. బొల్లారం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఇండ్ల నిర్మాణాల కోసం అనుమతులు పొందారు. అనుమతుల గడువు తీరడంతోపాటు బొల్లారం మున్సిపాలిటీగా మారింది. గ్రామ పంచాయతీ అనుమతులతోనే ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంతో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ సంగారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న మూడు ఇండ్లను జేసీబీతో ఫిల్లర్లు, స్లాబ్‌లను కూల్చివేశారు. ఇండ్ల కూల్చివేత సమయంలో నిర్మాణదారులు వాహనాలను అడ్డుకొని అధికారుల తీరును ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసినట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు.



బొల్లారం : అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

**ఆలయం కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

జిన్నారం, జనవరి 12 : మంగంపేటలోని సర్వేనంబర్ 55/3లో ఉన్న పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయం కూల్చివేతపై గ్రామస్తులు కలెక్టర్ వల్లూరు క్రాంతికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.

ఆజాద్ ఇంజినీరింగ్ కంపె నీ వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా ప్రైవేటు సెక్యూరిటీని పెట్టుకొని సుమారు వందేండ్ల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయం కూల్చివేతపై స్థానిక తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆలయం కూల్చివేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నంబర్ 55/2లో ఉన్న 27గుంటల స్థలాన్ని గ్రామ అవసరాల కోసం వినియోగించుకుంటామని తెలిపారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 86వ ర్యాంక్

అందోల్, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అందోల్-జోగిపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిల్లో 86వ ర్యాంక్, జోనల్ స్థాయిలో 26 ర్యాంక్ వచ్చిందని మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది, పాలకవర్గం కృషి ఫలితంగా మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందన్నారు.

**బొల్లారానికి 14వ ర్యాంకు**

బొల్లారం, జనవరి 12: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ర్యాంకులను ప్రకటించిందని బొల్లారం మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో బొల్లారం మున్సిపాలిటీ రాష్ట్రంలో 26వ స్థానం, జోన్‌లో 14వ స్థానంలో నిలిచినట్లు కమిషనర్ వెల్లడించారు. మున్సిపాలిటీలో స్వచ్ఛతకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శరత్‌కు ఘన సన్మానం

అమీన్‌పూర్, జనవరి 12: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శరత్‌కుమార్ బదిలీపై వెళ్లనుండడంతో ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అమీన్‌పూర్ మండల పంచాయతీ అధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.